జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 31 ॥మంగళవారం ॥ 30-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



## తెలంగాణలో పాత పెన్షన్‌కు మోక్షం ఎప్పుడు?



**ఆంధ్రప్రదేశ్‌లో పాత పెన్షన్‌కు ఆమోదం..**

**తెలంగాణలో ఇంకా న్యాయ పోరాటమే**

**సుమారు 10 నుంచి 13 వేల మంది ఉద్యోగులు,ఉపాధ్యాయులకు వర్తించే అంశం**

**సొంత రాష్ట్రంలో న్యాయం కోసం ఉద్యోగులు వీధిన పడి కొట్లాడుతుంటే.. పాలకులు మాత్రం సుప్రీంకోర్టులో పిటిషన్లు వేసి కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసం? 2003 ఉమ్మడి నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం పెద్దమనసుతో పాత పెన్షన్ ఆమోదించి హక్కును కాపాడితే.. తెలంగాణ ప్రభుత్వం మాత్రం హక్కుల హరణే ధ్యేయంగా అడ్డగోలు న్యాయపోరాటానికి దిగడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర మార్గదర్శకాలు, హైకోర్టు తీర్పులు స్పష్టంగా ఉన్నప్పటికీ, తమ స్వార్థ రాజకీయాల కోసం వేలాది మంది ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్లు, గ్రూప్-2 ఉద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చదరంగం ఆడుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003లో విడుదలైన ఒకే నియామక ప్రకటన ద్వారా ఎంపికైన వేలాది మంది ఉపాధ్యాయులు, ఇతర శాఖల ఉద్యోగులకు రాష్ట్ర విభజన అనంతరం రెండు రాష్ట్రాల్లో రెండు రకాల పెన్షన్ విధానాలు అమలవుతున్నాయనే అంశం మరోసారి చర్చనీయాంశమైంది. ఒకే నియామక ప్రకటన ద్వారా ఎంపికైన ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్‌లో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తుండగా, తెలంగాణలో మాత్రం అదే వర్గం ఉద్యోగులు నూతన పెన్షన్ విధానం పరిధిలో కొనసాగడం పట్ల బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2003లో ఉపాధ్యాయ నియామక ప్రకటన వెలువడగా, ఎంపిక ప్రక్రియ పూర్తయిన అనంతరం నియామక ఉత్తర్వులు 2004 సెప్టెంబరు తర్వాత జారీ కావడంతో అప్పుడే అమల్లోకి వచ్చిన నూతన పెన్షన్ విధానం వీరికి (మిగతా 2వ పేజీలో)



## శిల్పకళా వేదికలో
# రైతు భరోసా

**సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం**

**రాష్ట్రవ్యాప్తంగా రైతుల భాగస్వామ్యం**

**వర్షాల కారణంగా మధిర సభ రద్దు**



**హైదరాబాద్, జూన్ 29**

తెలంగాణ రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా పంపిణీ సదస్సును జూన్ 30న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించనున్నారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో రైతు ఆశీర్వాద సభగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిం చినప్పటికీ, వర్షాల కారణంగా ఆ సభను రద్దు చేసింది. ముఖ్యమ ంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచనల మేరకు కార్యక్రమాన్ని హైదరాబాద్ కు మార్చి నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.జూన్ 30న (మిగతా 2వ పేజీలో)

## మూసి పునరుజ్జీవ ప్రాజెక్టు అభివృద్ధికి మైలురాయి

**భూ సేకరణ, పునరావాసంపై మంత్రి పొంగులేటి సమీక్ష**

**బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపునకు ఆదేశాలు**

**మానవీయ కోణంలోనే ప్రాజెక్టు అమలు చేస్తామని స్పష్టం**

**హైదరాబాద్, జూన్ 29**

మూసి పునరుజ్జీవ ప్రాజెక్టు తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో భూ సేకరణ, (మిగతా 2వ పేజీలో)



## బియ్యం ఎగుమతులకు ప్రోత్సాహక విధానం

**ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 29**

తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న బియ్యానికి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎగుమతి ప్రోత్సాహక విధానాన్ని రూపొం దిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రైతులు, రైస్ మిల్లర్లకు లాభాలు చేకూరేలా విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రత్యక్ష ఎగుమతులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. హైదరా బాద్‌లో సోమవారం కేపీసీ న్యూట్రి సంస్థ రూపొందించిన మల్టీ-విటమిన్ రైస్ ఉత్పత్తిని ఆవిష్కరించిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. పోషకాహారంతో కూడిన బియ్యం ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా, రైతుల కు అదనపు ఆదాయం అందించేఅవకాశాలను సృష్టిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో (మిగతా 2వ పేజీలో)



## ఆశీర్వాద సభ వాయిదా

**రైతు భరోసా నిధుల విడుదల యథావిధిగా కొనసాగుతుందని వెల్లడి**

- సభా స్థలాన్ని పరిశీలించిన భట్టి, తుమ్మల
- జూలై తొలి వారంలో సభ నిర్వహణకు ఏర్పాట్లు

**ఖమ్మం, జూన్ 29**

నిరంతర వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ నెల 30న ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలోని జగన్నాథపురం గ్రామంలో నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. (మిగతా 2వ పేజీలో)



## అఫ్గాన్‌పై పాక్ భీకర వైమానిక దాడులు

**'డబుల్ ట్యాప్' దాడులపై తీవ్ర వివాదం**

**ఉగ్రవాదులే లక్ష్యమన్న పాకిస్థాన్**

**అమాయక పౌరులే బలయ్యారన్న అఫ్గానిస్థాన్**

**ఇస్లామాబాద్, జూన్ 29**

అఫ్గానిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్థాన్ సైన్యం నిర్వహించిన వైమానిక దాడులు మరోసారి ఇరు దేశాల మధ్య (మిగతా 2వ పేజీలో)



## ఫ్రాన్స్‌తో పర్యాటకం, సాంస్కృతిక రంగాల్లో భాగస్వామ్యం

**సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**హైదరాబాద్, జూన్ 29**

తెలంగాణ--ఫ్రాన్స్ మధ్య పర్యాటకం, సాంస్కృతిక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రజల మధ్య సంబంధాలు, వారసత్వ పరిరక్షణలో భాగస్వామ్యం పెరగడం ద్వారా పర్యాటకం, పెట్టుబడులు, ఆర్థికాభివృద్ధికి కొత్త (మిగతా 2వ పేజీలో)



## కొడంగల్‌లో డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్ గెలిచారు

**టీ ఆర్ఎస్ అధ్యక్షురాలు**

**హైదరాబాద్, జూన్ 29**

కొడంగల్ నియోజకవర్గంలో డూప్లి కేట్ ఓట్ల కారణంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో 32 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారని తెలంగాణ రక్షణ సేన (టీ ఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత ఆరోపించా రు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 2018 నుంచి 2023 (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

మేషం: ఆప్తుల నుండి అవసరానికి ధన సహకారం అందుతుంది. పాత ఋణాల నుండి విముక్తి లభిస్తుంది. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. వ్యాపారపరంగా నూతన పెట్టుబడులు లభిస్తాయి. సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

వృషభం: చుట్టుపక్కల వారితో ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల సహాయంతో పదోన్నతులు పెరుగుతాయి. ముఖ్యమైన పనులలో ఆత్మ విశ్వాసంతో పని చేసి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు లభించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి.

మిధునం: ఋణ ఒత్తిడి అధికమై మానసిక శిరో భాధలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. దైవ సేవా కార్యక్రమాలలో ఆప్తులతో పాల్గొంటారు. సంతాన విద్యా విషయంలో ఊహించని విషయాలు తెలుస్తాయి. స్థిరాస్తి ఒప్పందాలు అతికష్టం మీద పూర్తవుతాయి. వృత్తి ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

కర్కాటకం: మిత్రులకు మీ అభిప్రాయాలు నచ్చవు. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేయలేరు. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలుంటాయి. ఇంటా బయట ఒత్తిడి వలన మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాల్లో సహోద్యోగులతో సమస్యలు కలుగుతాయి. వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి.

సింహం: ఆర్ధిక ప్రయత్నాలు అనుకూల ఫలితాలు ఇస్తాయి. బంధుమిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో అందరితో సఖ్యతగా వ్యవహారిస్తారు. సమాజంలో కీర్తిప్రతిష్టలు పెరుగుతాయి. వాహన యోగం ఉన్నది. జీవిత భాగస్వామితో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. బంధు మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు.

తుల: ముఖ్యమైన విషయాలలో స్వంత నిర్ణయాలు కలిసిరావు. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. వృత్తి ఉద్యోగమున విలువైన పత్రములు విషయంలో జాగ్రత్త వ్యవహరించాలి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృశ్చికం: కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున అనుకూలత పెరుగుతుంది. చేపట్టిన పనులు అనుకూలంగా సాగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

ధనస్సు: కీలక వ్యవహారాలలో ధైర్యంగా నిర్ణయాలను తీసుకుని లాభాలు అందుకుంటారు. నూతన వ్యాపార ప్రారంభానికి పెట్టుబడులు అందుతాయి. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఇతరుల నుండి ఆశించిన సహాయం అందుతుంది. సోదరుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

మకరం: చెయ్యని పనికి ఇతరుల నుండి విమర్శలు ఎదురవుతాయి. అనవసర వస్తువులపై ధనవ్యయం చేస్తారు. ఉద్యోగమున పని ఒత్తిడి పెరిగి సమయానికి నిద్రాహారాలు ఉండవు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఆప్తులతో మాట పట్టింపులు కలుగుతాయి.

కుంభం: సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సంతానం విద్యా విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

మీనం: ప్రయాణాలలో మార్గ అవరోధాలు తప్పవు. ధన వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు మంచివి కావు. వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి. ఊహించని రీతిలో ఖర్చులు పెరుగుతాయి. ఇంటా బయట ప్రతి విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.



# తెలంగాణలో పాత పెన్షన్‌కు మోక్షం ఎప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

వర్తించింది. అయితే నియామక ప్రకటన, ఖాళీల గుర్తింపు, ఎంపిక ప్రక్రియ మొత్తం నూతన పెన్షన్ అమలుకు ముందే పూర్తయినందున తమకు పాత పెన్షన్ విధానం వర్తించాలని ఉద్యోగులు రెండు దశాబ్దాలుగా పోరాటం సాగిస్తున్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లో 2004 జనవరి 1కు ముందు ప్రకటించిన ఖాళీలకు సంబంధించిన నియామకాలకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయవచ్చని స్పష్టం చేసినట్లు ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి. ఇదే అంశాన్ని పరిగణనలోకి తీసుకొని తెలంగాణ ఉన్నత న్యాయస్థానం కూడా 2004 సెప్టెంబరు 1కు ముందు వెలువడిన నియామక ప్రకటనల ద్వారా ఎంపికైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తీర్పు ఇచ్చిందని గుర్తు చేస్తున్నారు. అయితే ఆ తీర్పుపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం పట్ల బాధితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఉమ్మడి రాష్ట్రంలో ఇదే 2003 నియామక




ప్రకటన ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపింది. దీంతో ఒకే నియామక ప్రకటన ద్వారా ఎంపికైన ఉద్యోగులకు రెండు రాష్ట్రాల్లో వేర్వేరు విధానాలు అమలవుతున్నాయనే పరిస్థితి ఏర్పడిందని ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి. ఈ సందర్భంగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు ఉద్యోగులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మానవీయ దృక్పథంతో నిర్ణయం తీసుకొని ఉపాధ్యాయులకు న్యాయం చేసిందని అన్నారు. తెలంగాణలో కూడా ఉన్నత న్యాయస్థానం తీర్పును గౌరవించి, సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ప్రత్యేక అనుమతి పిటిషన్‌ను ఉపసంహరించుకుని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులతో పాటు న్యాయశాఖ, కానిస్టేబుళ్లు, ఉపనిరీక్షకులు, సమూహ--2 తదితర నియామకాల ద్వారా ఉద్యోగాల్లో చేరిన సుమారు 10 నుంచి 13 వేల మంది ఉద్యోగులకు ఈ నిర్ణయం వర్తించే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, ఉన్నత న్యాయస్థానం తీర్పు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం కూడా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మూసి పునరుజ్జీవ ప్రాజెక్టు అభివృద్ధికి మైలురాయి


(మొదటి పేజీ తరువాయి)

పునరావాస అంశాలపై ఉన్నతాధికా రులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఎండీ ఈ.వి.నర్సింహారెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు పాల్గొ న్నారు. ప్రాజెక్టు అమలు పురోగతి, భూ సేకరణ, పునరావాస చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ మూసి నదిని పునరుజ్జీవింపజేసి హైదరాబా ద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పర్యాటక ం,ఉపాధి, ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారుతు ందని తెలిపారు. వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు, రహదా రులు, పార్కులు,వాక్‌వేలు, వినోద కేంద్రాల అభివృద్ధితో మూసి పరివాహక ప్రాంతాలకు కొత్త రూపు తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. మూసి ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదని,ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వ ం ముందుకు సాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పేదల జీవితాలు దెబ్బతిన కుండా ప్రతి నిర్ణయాన్ని మానవీయ కోణంలోనే తీసుకుం టామని తెలిపారు.ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాజెక్టును అమలు చేస్తామని అధికారులకు సూచించారు.భూ సేకరణలో ప్రజల సమస్యలను సానుభూతితో పరిశీలించాలని, ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించేందుకు తక్షణ కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భూము లు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం, అవసరమైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు.

# గోదావరిఖనిలో సింగరేణి క్యాథ్ ల్యాబ్ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

కార్డియాక్ క్యాథెటరైజేషన్ (క్యాథ్) ల్యాబ్‌ను సింగరేణి సంస్థ ఏర్పాటు చేసింది.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏడాది వ్యవధిలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసింది. ఈ కేంద్రం అందుబాటులోకి రావడంతో గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగానే చికిత్స అందించే అవకాశం కలగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు సింగరేణి ఉద్యోగులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.గోదావరిఖని పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న సుమారు 33 వేల మంది సింగరేణి ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు,పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, పెద్దపల్లి, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ప్రజలకు ఈ కేంద్రం ప్రయోజనం చేకూరనుంది.ఇప్పటి వరకు గుండెపోటుకు గురైన రోగులను హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి నగరాలకు తరలించాల్సి వచ్చేది. దీంతో అత్యంత కీలకమైన తొలి గంట సమయం వృథా అవుతూ ప్రాణాపాయం పెరిగేది.ఇప్పుడు గోదావరిఖనిలోనే అత్యవసరంగా యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, స్టెంట్ అమరిక వంటి అధునాతన గుండె చికిత్సలు అందుబాటులోకి రావడంతో వేలాది మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఏర్పడింది.సుమారు 7,890 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ఐదు పడకల గుండె అత్యవసర చికిత్స విభాగం, పది పడకల ఐసీయూ, ప్రత్యేక బాహ్య రోగుల విభాగం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్య విధానంలో రూపొందించిన ఈ ప్రాజెక్టుపై ఏడేళ్లలో సుమారు



రూ.50 కోట్ల వ్యయం చేయనున్నట్లు సింగరేణి సంస్థ తెలిపింది. ప్రతి ఏడాది సుమారు రూ.6 కోట్ల నిర్వహణ వ్యయం ఉంటుందని అంచనా వేస్తున్నారు.సింగరేణి సంస్థ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది.గత ఏడాదిలోనే గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దాదాపు మూడు వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులను కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించాల్సి వచ్చింది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని స్థానికంగానే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు సంస్థ పేర్కొంది. ఈ కేంద్రంలో నెలకు మూడు వేల మందికి పైగా రోగులు వైద్య సేవలు పొందే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పడకలలో 50 శాతం సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కోసం కేటాయించగా, సాధారణ ప్రజలకు కూడా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్‌ఎస్) ధరల ప్రకారం తక్కువ ఖర్చుతో సేవలు అందించనున్నారు. ఈ క్యాథ్ ల్యాబ్ ఉత్తర తెలంగాణలో గుండె వైద్య సేవలకు కీలక కేంద్రంగా నిలుస్తుందని సింగరేణి వైద్యాధికారులు తెలిపారు.

# శిల్పకళా వేదికలో రైతు భరోసా సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని రైతు భరోసా పథకం అమలుకు సంబంధించిన కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే ప్రక్రియపై ప్రభుత్వం కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నాయి.రాష్ట్రంలోని అన్ని జిల్లాల రైతులు, రైతు వేదికల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా, వర్చువల్ విధానంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రాలు, మండల స్థాయిలో ప్రత్యేక ప్రసార ఏర్పాట్లు చేసి ఎక్కువ మంది రైతులు కార్యక్రమాన్ని వీక్షించేలా చర్యలు తీసుకుంటున్నారు. రైతులకు పథకం అమలుపై పూర్తి అవగాహన కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వర్షాల కారణంగా మధిరలో సభ నిర్వహించడం సాధ్యంకాకపోవడంతో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శిల్పకళా వేదికలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్యక్రమానికి వచ్చే రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు భద్రత, ట్రాఫిక్, వాహనాల పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల నుంచి వచ్చే రైతుల రాకపోకలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను కూడా కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సంబంధిత శాఖలు అన్ని ఏర్పాట్లను తుది దశకు తీసుకెళ్లాయి. రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందించడంతో పాటు వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సదస్సు తెలంగాణ వ్యవసాయ రంగంలో కీలక ఘట్టంగా నిలవనుంది.

## కొడంగల్‌లో డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్ గెలిచారు

(మొదటి పేజీ తరువాయి)

మధ్య కొడంగల్ ఓటర్ల జాబితాలో కొత్తగా 30 వేల ఓట్లు నమోదయ్యా యని తెలిపారు. తమ పార్టీ నిర్వ హించిన పరిశీలనలో 22 వేలకుపైగా డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు గుర్తించామని, అలాగే కర్ణాటక రాష్ట్రంలోని సెడమ్ నియోజకవర్గానికి చెందిన 11 వేల మంది ఓటర్ల పేర్లు అక్రమంగా కొడంగల్ ఓటర్ల జాబితాలో నమోదు చేసినట్లు బయటపడిందని పేర్కొన్నా రు. మొత్తంగా 33 వేల అక్రమ ఓట్లను గుర్తించినప్పటికీ ఎన్నికల సంఘం కేవలం 800 ఓట్లను మాత్రమే తొలగించిందని కవిత విమర్శించారు. రేవంత్ రెడ్డి గెలుపు మెజారిటీ కూడా 32 వేల ఓట్లు కావడం వల్ల డూప్లికేట్ ఓట్లు, పొరుగు రాష్ట్రానికి చెందిన ఓట్లే ఆయన విజయానికి కారణమయ్యాయని ఆరోపించారు. బోధన్ నియోజక వర్గంలో 7 వేల ఓట్లను తొలగించిన అధికారులు, కొడంగల్‌లో మాత్రం కేవలం 800 ఓట్లకే పరిమితమయ్యారని విమర్శించారు. కొడంగల్‌లో లక్ష వరకు ఓట్లలో మార్పులు జరిగి ఉండొచ్చని, డబ్బుతో పాటు కర్ణాటక నుంచి ఓట్లను కూడా తెలంగాణకు తరలించారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని వ్యాఖ్యానించారు. విదేశీయులకు భారత్‌లో ఓటు హక్కు ఉండకూడదనే సూత్రాన్ని తాము సమర్థిస్తున్నామని, అయితే ఒకే వ్యక్తి రెండు రాష్ట్రాల్లో ఓటరుగా నమోదవడం ఎంతవరకు చట్టబద్ధమో ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రాల మధ్య డూప్లికేట్ ఓట్లను పూర్తిగా తొలగించే విధానాన్ని ఎన్నికల సంఘం అమలు చేయకపోతే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ లక్ష్యం నెరవేరదని ఆమె అభిప్రాయపడ్డారు.

## సాంస్కృతిక రంగాల్లో భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సోమవారం ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ, డిప్యూటీ కాన్సుల్ పాస్కల్ లోరా మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఇరు పక్షాలు పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ అంశాలపై విస్తృతంగా చర్చించాయి. తెలంగాణకు గొప్ప చారిత్రక, సాంస్కృతిక, నిర్మాణ వారసత్వం ఉందని మంత్రి జూపల్లి తెలిపారు. ఆధునిక ప్రపంచ నగరంగా హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతూనే తన చారిత్రక ప్రత్యేకతను కాపాడుకుంటోందని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను ఫ్రెంచ్ పర్యాటకులకు మరింత చేరువ చేయడంలో ఫ్రాన్స్ ప్రభుత్వం, ఫ్రాన్స్ రాయబార కార్యాలయం, పర్యాటక రంగ ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు. అలాగే కళాకారులు, పరిశోధకులు, పర్యాటక నిపుణులు, సాంస్కృతిక బృందాల పరస్పర పర్యటనలను ప్రోత్సహించాలని సూచించారు. వారసత్వ పరిరక్షణ, సాంస్కృతిక మార్పిడి, పర్యాటక ప్రచారం వంటి అంశాల్లో ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు సంయుక్త వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

## బియ్యం ఎగుమతులకు ప్రోత్సాహక విధానం

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తి అవుతున్న బియ్యానికి కొత్త మార్కెట్లను అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నప్పటికీ, ఎగుమతుల కోసం కొనుగోలు చేయడం లేదని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఎగుమతులను ప్రోత్సహించే ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుడుతోందని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎగుమ తులకు ముందుకు వచ్చే రైస్ మిల్లర్లు, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన అనుమతులను సులభంగా అందిస్తామని హామీ ఇచ్చారు.

శ్వేత
# సంపాదకీయం

మంగళవారం 30-6-2026

## మళ్లీ మొదటికొచ్చిన పశ్చిమసియా!

ట్రంప్ ప్రంపచానికి పట్టిన పీడలాగా తయారయ్యాడు. అటు దేశ ప్రజలకు, ఇటు ప్రపంచ ప్రజలకు ఎప్పుడీ పీడ విరగడ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. శాంతి చర్చల అనంతరం ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడంతో పశ్చిమాసియాను మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు, చర్యలకు పొంతన లేకుండ ఆపోయింది. దీంతో మళ్లీ యుద్ధం వస్తుందా అన్న భయంలో అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇకపోతే ఇటలీవల చేసుకున్న ఒప్పందాన్ని కూడా ట్రంప్ ఖాతరు చేయలేదు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందానికి పురిట్లోనే గండిపడింది. శనివారం మొదలైన పరస్పర దాడులు ఆదివారం మరింత ఉధృతం కావడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందా అన్న ఆందోళన కలుగుతోంది. దాడులు ఆపకుంటే ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు హెచ్చరించగా... తమ జోలికి వస్తే అమెరికాకు నరకం చూపిస్తామంటూ ఇరాన్ కూడా అంతేదీటుగా స్పందించింది. దీనితో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. హోర్ముజ్ జలసంధిలో తమ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రయాణిస్తోందంటూ ఎవర్ లవ్లీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ఉద్రిక్తత మొదలైంది. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందంటూ.. శనివారం హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఇరాన్‌లోని లక్ష్యాలపై అమెరికా యుద్ధ విమానాలతో దాడులు చేసింది. దీనితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపైకి ఇరాన్ డ్రోన్లు క్షిపణులను ప్రయోగించింది. అమెరికా దాడులపై ఇరాన్ దీటుగా స్పందించింది. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్ పోర్ట్ సల్మాన్ వద్ద ఉన్న అమెరికా ఐదో నావికాదళ స్థావరం సహా ఎనిమిది కీలక సైనిక కేంద్రాలను ధ్వంసం చేశామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) పేర్కొంది. అమెరికా చేసే ఎలాంటి దాడులకైనా మా స్పందన అత్యంత విధ్వంసకరంగా ఉంటుందని హెచ్చరించింది. కాగా, తమ దేశంవైపు వస్తున్న క్షిపణులు, డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలతో విజయవంతంగా అడ్డుకుంటున్నామని కువైట్ ప్రకటించింది. అయితే హోర్ముజ్ జలసంధిలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న భారీ చమురు ట్యాంకర్ నౌక 'కికు'పై శనివారం రాత్రి దాడి జరిగింది. ఇది ఇరాన్ పనేనంటూ అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం తెల్లవారుజామున పర్షియన్ గల్ఫ్‌లోని ఇరాన్ దీవి 'ఖెష్మ్'పై, హోర్ముజ్ జలసంధి సమీపతీరంలోని సిరిక్, బందర్ ఈ లెంగే నగరాల్లో 10 ప్రాంతాలపై భారీస్థాయిలో దాడులు చేసింది. ఇరాన్ నిఘా, కమ్యూనికేషన్ వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, సముద్ర మందుపాతరల నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్టు ప్రకటించింది. ఈ దాడులకు సంబంధించి 38 సెకన్ల వీడియోను విడుదల చేసింది. పరస్పర దాడు లు కొనసాగుతున్నా హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని.. అమెరికా నౌకాదళం పూర్తి అప్రమత్తత ఉందని పేర్కొంది.

అమెరికా, ఇరాన్ చర్చలకు మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్.. తాజా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్ర యత్నాలు మొదలుపెట్టింది. దీనిపై పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఇరుదేశాల ప్రతినిధులను సంప్రదించారు. కాల్పుల విరమణ, అవగాహన ఒప్పందానికి కట్టుబడి ఉండాలని కరారు. ఇక యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ కాజా కల్లాస్, బహ్రెయిన్ విదేశాంగ మంత్రి రషీద్ కూడా ఇషాక్‌దార్‌తో మాట్లాడారు. కాగా కువైట్, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడులను గల్ఫ్ దేశాల కూటమి 'గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)' ఖండించింది. వెంటనే దాడులు ఆపాలని విజ్ఞప్తి చేసింది. అమెరికా చేసే ప్రతీ దాడికీ తమ ప్రతిదాడి ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. కాల్పుల విరమణను అమెరికాయే ఉల్లంఘిస్తోందని, ఇది ఇలాగే కొనసాగితే శాంతి ఒప్పందం కోసం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలన్నీ నిలిచిపోతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐఆర్‌జీసీ నావికాదళ కమాండర్ ప్రకటన చేశారు. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు.

అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఇరాన్ మళ్లీ కాల్పు ల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో మా సైన్యం దాడులు చేయాల్సి వచ్చింది. ఇరాన్ ఎప్పటికీ పాఠం నేర్చుకునేలా కనిపించడంలేదు. మా సహనానికి హద్దు అంటూ ఉంటుంది. అది దాటితే మేం సైన్యంతోనే పని పూర్తి చేయాల్సి వస్తుంది. అదే జరిగితే ఇక ఇరాన్ అనే దేశమే ఉండదని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.విదేశాల నుంచి భారత్‌కు సరుకు రవాణా చేస్తున్న ఏడు కార్గో నౌకలు గత మూడు రోజుల్లో హోర్ముజ్ జలసంధిని దాటాయి. వీటిలో 65 వేల టన్నుల రసాయన ఎరువులు తీసుకొస్తున్న రెండు నౌకలు శనివారం ఈ మార్గం గుండా వచ్చాయి. అంతకుముందు రోజు లక్ష టన్నులకు పైగా ముడి చమురుతో 'దేశ్ సురక్ష' ట్యాంకర్, 18,732 టన్నుల సరుకుతో 'ప్రభు పార్వతి' నౌక ఇదే మార్గం గుండా భారత్‌కు వచ్చాయి. ఇవిగాక మరో రెండు విదేశీ నౌకలు ఇదే మార్గంలో ప్రయాణించాయి. హోర్ముజ్ ద్వారా భారత్‌కు రావాల్సిన మరో 15కు పైగా నౌకలు తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్‌లో వేచి ఉన్నాయి. వీటిలో భారతీయ జెండా గల 10 నౌకలు ఉన్నాయి. వాటిలో నాలుగు ఎరువులను, మరొకటి ఇంధనాన్ని తీసుకురానున్నాయి. ఇప్పుడు ఉద్రిక్తతల కారణంగా పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళన కలుగుతోంది.



## గుణదల ప్రజలకు రూ.98.68 కోట్ల అభివృద్ధి కానుక

### దశాబ్దాల ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎంపీ కేశినేని చిన్ని

### అభివృద్ధి ఆగదు... ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం: ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని

విజయవాడ, జూన్ 29: ప్రజలకు ఇచ్చిన హామీలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా, చేతల్లో చూపిస్తూ విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో మరో కీలక అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దశాబ్దాలుగా గుణదల--నున్న ప్రాంత ప్రజలను తీవ్రంగా వేధిస్తున్న రైల్వే గేటు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రూ.98.68 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ)కి సోమవారం ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. ఎన్నికల సమయంలో గుణదల ప్రజలకు ఇచ్చిన హామీని ఏడాది వ్యవధిలోనే నిలబెట్టుకోవడం స్థానికంగా విశేష చర్చనీయాంశంగా మారింది. ఈ శంకుస్థాపనతో "మాటలు కాదు, చేతలే" అనే సందేశాన్ని ఆయన మరోసారి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారని స్థానికులు కొనియాడారు.

#### 18 నెలల్లో ప్రాజెక్టు పూర్తి: ఎంపీ కేశినేని చిన్ని

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. గుణదల ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ ఆర్‌ఓబీ పూర్తయితే గుణదల--నున్న ప్రాంతాల మధ్య రాకపోకలకు ఎదురవుతున్న దశాబ్దాల కష్టాలు పూర్తిగా తొలగిపోతాయన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఉన్న 'డబల్ ఇంజిన్' సర్కారుతో తమ ప్రగతి ప్రయాణం నిరంతరం కొనసాగుతుందని, నగరంలో అభివృద్ధి ఎక్కడా ఆగదని స్పష్టం చేశారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని రైల్వే ఓవర్ బ్రిడ్జిలను దశలవారీగా పూర్తి చేయడమే తన లక్ష్యమని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుతో సమన్వయం చేసుకుంటూ ఉలవచారు కంపెనీ సమీపంలో మరో ఆర్‌ఓబీకి కూడా త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఆ ప్రాజెక్టును కూడా రెండేళ్ల కాలపరిమితిలో పూర్తయ్యేలా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తామని తెలిపారు.

#### తప్పనున్న ట్రాఫిక్ నిరీక్షణ.. కరగనున్న ఇబ్బందులు

గుణదల రైల్వే లెవెల్ క్రాసింగ్ నంబర్--316 వద్ద ప్రతిరోజూ సుమారు 170 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ కారణంగా రోజుకు దాదాపు 14 నుంచి 16 గంటల పాటు రైల్వే గేటు మూసివేయాల్సి వస్తోంది. దీంతో నిత్యం వేలాది మంది వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే, ఇప్పుడు నిర్మించబోయే ఆర్‌ఓబీ పూర్తయిన తర్వాత ప్రస్తుతం వాహనదారులు ఎదుర్కొంటున్న 15 నుండి 20 నిమిషాల నిరీక్షణ సమయం కేవలం ఒక్క నిమిషానికి తగ్గిపోనుంది. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు పూర్తిగా తొలగిపోయి రాకపోకలు అత్యంత సులభతరం కానున్నాయి.

#### 920 మీటర్ల పొడవుతో అత్యాధునిక నిర్మాణం

రూ.98.68 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ నూతన ఆర్‌ఓబీ మొత్తం 920 మీటర్ల పొడవుతో, 18 స్పాన్లతో అత్యంత ఆధునికంగా రూపుదిద్దుకోనుంది. కేవలం బ్రిడ్జి మాత్రమే కాకుండా, ప్రధాన రహదారితో పాటు ఇరువైపులా సర్వీస్ రోడ్లు, వాహనాల భద్రత కోసం క్రాష్ బ్యారియర్లు, అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థను కూడా ఇందులో ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రాబోయే 18 నెలల్లోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.

#### నిరంతర కృషితోనే నిధుల మంజూరు

ఈ ప్రాజెక్టు మంజూరు కోసం కేంద్ర రైల్వే శాఖతో పలుమార్లు చర్చలు జరిపి, ప్రజల సమస్య తీవ్రతను వివరించి నిధులు సాధించామని ఎంపీ చిన్ని గుర్తుచేశారు. ఈ పనులకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గుణదల ఆర్‌ఓబీ శంకుస్థాపన విజయవాడ నగర అభివృద్ధి చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలిచిపోతుందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు ఏడీఆర్ఎమ్ ఎడ్విన్, సైమన్, డీసీఎమ్ ప్రశాంత్ కుమార్, సీనియర్ ఇంజినీర్ ఎస్. శ్రీనివాసరావు, రమణారావు పాల్గొన్నారు. అలాగే స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు బొప్పన భవ కుమార్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, కె. కిరణ్, రఘురామరాజు, గురునాథం, కరీముల్లా, సాయి చరణ్, ఉషారాణి, సంజయ్ వర్మ, వల్లభనేని సతీష్, రేగేళ్ల లక్ష్మణరావు, పిళ్లా శ్రీనివాసరావు, ఆషా, మాల్యాద్రి తదితర ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


## యూకేలో చదువు.. ప్రపంచాన్ని చేరుకునే తెలివైన నిర్ణయం

నేటి ప్రపంచంలో డిగ్రీ మాత్రమే కాదు, అంతర్జాతీయ గుర్తింపు, ప్రాక్టికల్ నైపుణ్యాలు మరియు గ్లోబల్ కెరీర్ అవకాశాలు కూడా ఎంతో కీలకంగా మారాయి. ఈ అవసరాలను తీర్చగలిగే దేశాల్లో లిలియునైటెడ్ కింగ్‌డమ్ (ఖఖ)లిలి అగ్రస్థానంలో నిలుస్తోంది. ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలు, అత్యాధునిక బోధనా విధానాలు మరియు ఉద్యోగావకాశాలకు అనుగుణమైన కోర్సులతో యూకే ప్రతి సంవత్సరం వేలాది మంది భారతీయ విద్యార్థులను ఆకర్షిస్తోంది.

**ఎందుకు యూకేనే ఎంచుకోవాలి?**

యూకేలోని విశ్వవిద్యాలయాలు కేవలం పాఠ్యాంశాలను మాత్రమే బోధించవు. విద్యార్థులలో విశ్లేషణాత్మక ఆలోచన, నాయకత్వ లక్షణాలు, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందిస్తాయి. తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను పరిశ్రమల అవసరాలకు అనుసంధానం చేసే విధంగా కోర్సులు రూపొందించబడటం యూకే విద్యా వ్యవస్థ ప్రత్యేకత. యూకేలో చదవడం ద్వారా విద్యార్థులు ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వచ్చిన విద్యార్థులతో కలిసి చదివే అవకాశం పొందుతారు. ఇది వారి కమ్యూనికేషన్ నైపుణ్యాలను, ఆత్మవిశ్వాసాన్ని మరియు అంతర్జాతీయ దృక్పథాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

**యూకేలో చదవడం వల్ల ముఖ్యమైన ప్రయోజనాలు**

- ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన డిగ్రీలు
- ఒక సంవత్సరం మాస్టర్స్, మూడు సంవత్సరాల బ్యాచిలర్స్ వంటి తక్కువ వ్యవధి కోర్సులు
- చదువుతో పాటు పార్ట్-టైమ్ ఉద్యోగ అవకాశాలు
- చదువు పూర్తైన తర్వాత Graduate Route ద్వారా ఉద్యోగ అన్వేషణ అవకాశం
- అత్యాధునిక ల్యాబ్స్, పరిశోధన సదుపాయాలు మరియు పరిశ్రమలతో అనుసంధానమైన బోధన
- ప్రపంచవ్యాప్తంగా కెరీర్ అవకాశాలకు బలమైన పునాది

**విదేశీ విద్యలో సరైన మార్గదర్శకులు**

EXXEELLA Educational Group

విదేశీ విద్య ప్రయాణం సరైన ప్రణాళికతో ప్రారంభమవుతుంది. సరైన యూనివర్సిటీ, సరైన కోర్సు, సరైన డాక్యుమెంటేషన్ మరియు వీసా ప్రక్రియలో నిపుణుల సహాయం ఎంతో అవసరం.

ఈ ప్రయాణంలో EXXEELLA Educational Group విద్యార్థులకు నమ్మకమైన భాగస్వామిగా నిలుస్తోంది. విద్యార్థుల అర్హతలు, ఆసక్తులు, కెరీర్ లక్ష్యాలు మరియు బడ్జెట్‌ను విశ్లేషించి వారికి సరిపోయే యూనివర్సిటీలు మరియు కోర్సులను సూచిస్తుంది. అడ్మిషన్ నుంచి వీసా వరకు ప్రతి దశలో ప్రొఫెషనల్ గైడెన్స్ అందిస్తూ, డాక్యుమెంటేషన్, ూూా, స్కాలర్‌షిప్ మార్గదర్శకత్వం, వీసా ఫైలింగ్ మరియు ప్రీ-డిపార్చర్ సపోర్ట్ వంటి సేవలతో విద్యార్థుల కలలను నిజం చేస్తోంది.

**మీ కలలకు ఇప్పుడు రెక్కలు ఇవ్వండి**


యూకేలో బ్యాచిలర్స్, మాస్టర్స్ లేదా ఇతర ఉన్నత విద్యను అభ్యసించాలని భావిస్తున్నారా? సరైన మార్గదర్శకత్వం మరియు సమయానికి తీసుకునే నిర్ణయం మీ భవిష్యత్తును మార్చగలదు.

ఈరోజే మీ UK Study Journey ప్రారంభించండి.

**EXXEELLA Educational Group**

మీ కలలకు ప్రపంచ స్థాయి అవకాశాల వంతెన.

Study in the UK. Build a Global Future. Achieve Success with EXXEELLA.



Akhila Gaddameedi
Senior Adviser
Exxeella Education Group
9854422244
akhila@exxeella.com

# ఘనంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైసల్ జన్మదిన వేడుకలు



సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 29

సంగారెడ్డి, జూన్ 29: టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ జన్మదిన వేడుకలను సోమవారం సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఫైసల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ, ఫైసల్ మూడు దశాబ్దాలకు పైగా పాత్రికేయ రంగంలో సేవలందిస్తూ అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి చేరుకున్నారని అన్నారు. పాత్రికేయుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ ద్వారా నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఆయన నాయకత్వంలో జర్నలిస్టుల సంక్షేమం, సంఘం అభివృద్ధికి కృషి కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ఫైసల్‌తో కేక్ కట్ చేయించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కూడా ఫైసల్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మసూద్, అహ్మద్ ఖాన్, మహమ్మద్ సిద్ధిఖ్, ఎం.ఏ. మతీన్, అక్మల్, నజీర్, మహమ్మద్ ఆరిఫ్, శేఖర్, తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయాలి

## ఫారాలు పూర్తిగా నింపి సమర్పిస్తేనే ముసాయిదా ఓటరు జాబితాలో పేరు నమోదు

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 29

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి అధికారులు స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ప్రతి ఓటరు ఫారాన్ని పూర్తిగా నింపి తిరిగి సమర్పించినప్పుడే వారి పేరు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు అవుతుందని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. కార్యక్రమాన్ని పూర్తిస్థాయి పారదర్శకతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ బాధ్యతను క్షేత్రస్థాయి అధికారులే నిర్వహించాలని, ఇతరులకు అప్పగించడం లేదా వారి ద్వారా సర్వే చేయించడం అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. పర్యవేక్షకులు తమ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో నిరంతరం పర్యటిస్తూ క్షేత్రస్థాయి అధికారుల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్లకు సహాయంగా ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్, కలెక్టరేట్, ఎన్నికల నమోదు అధికారుల కార్యాలయాల్లోని సహాయ కేంద్రాల వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఫారాలు నింపడంలో ప్రజలకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసి అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. విధుల నిర్వహణ సమయంలో క్షేత్రస్థాయి అధికారులు ఎన్నికల సంఘం అందజేసిన గుర్తింపు దుస్తులు, టోపీ, గుర్తింపు కార్డు, సంచిని తప్పనిసరిగా వినియోగించాలని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా, సహనంతో వ్యవహరించాలని సూచించారు. అలాగే ఫారాల పంపిణీ, సేకరణ, ఓటరు అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 55 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందన్నారు. ప్రజల్లో అవగాహన పెరుగుతోందని, వంద శాతం ఫారాల పంపిణీతో పాటు పూర్తిగా నింపిన ఫారాల సేకరణకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, రెవెన్యూ డివిజనల్ అధికారులు రాజేందర్, రమేష్, వెంకటేశం, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.






# ఒలింపిక్ స్ఫూర్తిని అలవర్చుకోవాలి

నిజామాబాద్, జూన్ 29

నిజామాబాద్ జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 40వ ఒలింపిక్ డే రన్--2026 కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడాకారులు, యువతతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఆయన, ఒలింపిక్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడల ప్రధాన సందేశాలైన క్రమశిక్షణ, ఐక్యత, శాంతి, ఆరోగ్యకర జీవన విధానాన్ని ప్రతి వ్యక్తి అలవర్చుకోవాలని సూచించారు. క్రీడలు కేవలం పోటీలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, సమాజంలో ఐక్యత పెంపొందించేందుకు కూడా దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. క్రీడా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని రాష్ట్రానికి, దేశానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాస్ఫూర్తి జీవితంలో విజయాలకు పునాది అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి అవస రమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోం దని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారు లను వెలికితీసి వారికి అవసరమైన ప్రోత్సాహం అందించా ల్సిన అవసరం ఉందన్నారు. యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చు కోవాలని సూచిం చారు. ఒలింపిక్ డే రన్ ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందిం చడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచే ప్రయత్నం జరుగుతోందని నిర్వా హకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో క్రీడాకా రులు, విద్యార్థులు, యువత ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవం తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ప్రతినిధులు, క్రీడా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు. క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేసి యువతను ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములను చేయాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.




# జూలైలో ఐదు రోజులు యూడీఐడీ (సదరం) శిబిరాలు

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 29

దివ్యాంగుల ప్రత్యేక గుర్తింపు కార్డు (యూడీఐడీ--సదరం) శిబిరాలను జూలై నెలలో ఐదు విడతల్లో నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. జూలై 1, 8, 15, 22, 29 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు, పునరుద్ధరణ కోరే వారు యూడీఐడీ అంతర్జాల వేదిక ద్వారా ముందస్తుగా సమయాన్ని నమోదు చేసుకోవాలని సూచించారు. అంతర్జాల వేదికలో సమయం నమోదు చేసుకున్న అనంతరం దూరవాణి లేదా సందేశం ద్వారా నిర్ధారణ అందిన వారు మాత్రమే శిబిరానికి హాజరుకావాలని అధికారులు తెలిపారు. శిబిరానికి వచ్చే అభ్యర్థులు దరఖాస్తు పత్రం, ఆధార్ కార్డు ప్రతులు, పాస్‌పోర్టు పరిమాణంలోని ఫొటో, సంబంధిత వైద్య నివేదికలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.

# ఓటరు గణన ఫారాల పంపిణీ వేగవంతం చేయాలి

ములుగు, జూన్ 29

ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గణన ఫారాల పంపిణీని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ఎన్నికల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ములుగు జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ గణన ఫారాలను బూత్ స్థాయి అధికారులు మాత్రమే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార వ్యక్తులతో ఫారాల పంపిణీ చేయకూడదని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి గణన ఫారాలను పంపిణీ చేయాలని సీఈఓ పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తన గణన ఫారాన్ని తప్పనిసరిగా సమర్పించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన వివరాలు తెలియజేస్తూ ఫారాల సమర్పణలో సహకారం అందించాలని అధికారులకు సూచించారు. గణన ఫారాన్ని సమర్పించిన ఓటర్ల వివరాలు మాత్రమే ముసాయిదా ఓటరు జాబితాలో కొనసాగించబడతాయని సుధర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. అందువల్ల అర్హులైన ప్రతి ఓటరు నిర్ణీత గడువులోగా ఫారాన్ని సమర్పించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు, జాప్యాలకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.





# ప్రిన్సిపాల్‌పై దాడి కేసులో బీజేపీ నేత అరెస్ట్


నిజామాబాద్, జూన్ 29

ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉర్దూ బోధన అంశంపై చెలరేగిన వివాదం తీవ్రరూపం దాల్చింది. పాఠశాల ప్రిన్సిపాల్‌పై దాడి చేసిన కేసులో ఆర్మూర్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు మందుల బాలును పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడంతో పోలీసులు చర్యలు వేగవంతం చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డికి చెందినదిగా చెబుతున్న అంకాపూర్‌లోని ఓ అతిథి గృహంలో ఉన్న మందుల బాలును అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బాలు, ఆయన అనుచరులు పోలీసులను ప్రతిఘటించడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అనంతరం పోలీసులు ఆయనను వాహనంలో తీసుకెళ్లి విచారణ ప్రారంభించారు. జూన్ 27న ఆర్మూర్‌లోని భారత్ చంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ అమెర్ ఖాన్‌పై మందుల బాలు, ఆయన అనుచరులు దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలో ఉర్దూను బోధించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ ఘటన జరిగినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఉర్దూతో పాటు విద్యార్థులకు మతపరమైన పద్ధతులు బోధిస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించగా, ఆ ఆరోపణలను పాఠశాల యాజమాన్యం ఖండించింది. కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రుల అభ్యర్థన మేరకే ఉర్దూను రెండో భాషగా ప్రవేశపెట్టినట్లు పాఠశాల కరస్పాండెంట్ మల్లయ్య తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ ఫిర్యాదు మేరకు మందుల బాలుపై నేరపూరిత చొరబాటు, దాడి తదితర సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు, ఆర్మూర్ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు ప్రిన్సిపాల్, పాఠశాల కరస్పాండెంట్‌పై కూడా వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టారనే ఆరోపణలతో కౌంటర్ కేసు నమోదు చేశారు. ఇరు కేసులపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి స్పందిస్తూ ఉర్దూ తెలంగాణ చరిత్ర, సంస్కృతిలో భాగమైన గొప్ప భాష అని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై రాజకీయ వర్గాల మధ్య పరస్పర విమర్శలు కొనసాగుతుండగా, పోలీసులు చట్టపరమైన దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

మంచిర్యాల, జూన్ 29

మంచిర్యాల జిల్లాలో భారీ వర్షాల కారణంగా రహదారి బురదమయంగా మారడంతో ఆర్టీసీ బస్సు రోడ్డుపై కూరుకుపోయింది. హాజీపూర్ మండలం దొనబండ సమీపంలో సోమవారం ఈ ఘటన చోటుచే సుకుంది. బస్సు ముందుకు కదల్లేక పోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు గంటల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం ప్రకారం సాధారణ ప్రయా ణంలో ఉన్న ఆర్టీసీ బస్సు దొనబండ సమీపానికి చేరుకోగానే వర్షాలతో బురదగా మారిన రహదారిలో చక్రాలు దిగబడిపోయాయి. డ్రైవర్ పలుమార్లు బస్సును బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో బస్సు అక్కడే నిలిచిపోవాల్సి వచ్చింది. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు చాలా సేపు నిరీక్షించాల్సి వచ్చింది. సమీప గ్రామాల ప్రజలు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సును బయటకు తీసేందుకు ప్రయత్నించినా సాధ్యంకాకపోవడంతో జేసీబీని తీసుకొచ్చారు. జేసీబీ సహాయంతో బస్సును బురదలో నుంచి నెమ్మదిగా బయటకు లాగడంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం బస్సు తిరిగి ప్రయాణాన్ని కొనసాగించింది. ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో ఆ ప్రాంత రహదారి దుస్థితి మరోసారి వెలుగులోకి వచ్చింది. వర్షాలు కురిసిన ప్రతిసారీ ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు తెలిపారు. రహదారిని తక్షణమే మరమ్మతులు చేసి ప్రయాణానికి అనువుగా మార్చాలని వారు అధికారులను కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దెబ్బతిన్న గ్రామీణ రహదారుల మరమ్మతులకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే ఇలాంటి ఘటనలు పునరావృతమై ప్రజలు, విద్యార్థులు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





## నూతన జిల్లా న్యాయమూర్తికి శుభాకాంక్షలు

**వనపర్తి, జూన్ 29**

వనపర్తి జిల్లా నూతన జిల్లా న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన బాకరాజు శ్రీనివాసరావును జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సునీతా రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో భేటీ అయి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి బాధ్యతల స్వీకరణ సందర్భంగా అభినందనలు తెలిపారు. వనపర్తి జిల్లాలో ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ శుభాభినందనలు తెలియజేశారు. జిల్లా పరిపాలన, న్యాయవ్యవస్థ, పోలీసు శాఖల మధ్య సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా కలిసి పనిచేయాల్సిన అవసరంపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు పరస్పర సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు.

జిల్లాలో న్యాయ పరిపాలన సమర్థవంతంగా కొనసాగేందుకు అవసరమైన అన్ని సహకారాలు అందిస్తామని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. న్యాయవ్యవస్థ బలోపేతానికి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, న్యాయవ్యవస్థ సమర్థ నిర్వహణలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు. కోర్టు వ్యవహారాలకు సంబంధించిన అంశాల్లో అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా కోర్టు అధికారులు పాల్గొన్నారు. జిల్లా న్యాయవ్యవస్థ, పరిపాలన వ్యవస్థ సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



## ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం

**ఆదిలాబాద్, జూన్ 29**

జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, రెవెన్యూ, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన వినతులను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజావాణి పోర్టల్‌లో నమోదైన దరఖాస్తులను శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దని స్పష్టం చేశారు. ప్రతి శాఖ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి వినతిని సానుకూల దృక్పథంతో పరిశీలించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అధికారులను జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ శాలువాతో సత్కరించారు. అలాగే డాక్టరేట్ పట్టా పొందిన కలెక్టరేట్ పరిపాలన అధికారిని అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడుతూ మరింత బాధ్యతతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రూ, రాజేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి స్రవంతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణాధికారి రవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు.

## పాత భవనాల తొలగింపుపై సీపీ సమీక్ష

**వరంగల్, జూన్ 29**



వరంగల్ పోలీసు కమిషనరేట్ నూతన భవనం పరిసరాల్లోని పాత భవనాల తొలగింపు ప్రక్రియపై పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. సంబంధిత అధికారులతో కలిసి పాత భవనాలను పరిశీలించి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాత భవనాల తొలగింపు, కార్యాలయాల తరలింపు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖల పనితీరుకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రతి దశను సమన్వయంతో అమలు చేయాలని సూచించారు. ప్రజలకు అందించే పోలీసు సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా కార్యాలయాల తరలింపు ప్రక్రియను నిర్వహించాలని సీపీ స్పష్టం చేశారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పరిపాలనా కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. నూతన కమిషనరేట్ భవనం పరిసరాలను మరింత సక్రమంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. భద్రతా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల కల్పన, కార్యాలయాల సమర్థ నిర్వహణకు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. పాత భవనాల తొలగింపు సమయంలో భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సీపీ అధికారులకు సూచించారు.

## ప్రజావాణి వినతులకు తక్షణ పరిష్కారం

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 29**



జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అర్జీలను కలెక్టర్‌కు అందజేశారు. ప్రతి సమస్యను సంబంధిత శాఖల అధికారులు బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించగల అంశాలను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. క్లిష్టమైన సమస్యలను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి అవకాశాలు, తాగునీరు, రహదారులు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి శాఖ తమ పరిధిలోని ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు ప్రారంభించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం ఉంటే ప్రజా సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం లేదా జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని హెచ్చరించారు.



## వరద ముప్పుపై యంత్రాంగం అప్రమత్తం

**ములుగు, జూన్ 29**

భారీ వర్షాలు, ఆకస్మిక వరదలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సుధీర్ రామ్నాథ్ కేకన్‌తో కలిసి జిల్లాస్థాయి అధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసించే కుటుంబాలను ముందుగానే గుర్తించి వారికి మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని జూలై నెలలోనే అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముంపునకు గురయ్యే ఇళ్ల వివరాలను పంచాయతీ కార్యదర్శులు ముందుగానే సిద్ధం చేయాలని చెప్పారు. గర్భిణులు, వృద్ధులు, ఇతర బలహీన వర్గాలను ముందుగానే గుర్తించి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. వరదల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆశ్రయ కేంద్రాలు, ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని లోతట్టు కల్వర్టులు, వాగులు, గోదావరి నది పరివాహక ప్రాంతాలు, ప్రమాదకర రహదారులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే

**హైదరాబాద్, జూన్ 29**

భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం చిలుకనగర్ డివిజన్‌లో పరిశీలించారు. బూత్ స్థాయిలో జరుగుతున్న ప్రక్రియను పరిశీలించి బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), బూత్ లెవల్ ఏజెంట్లతో (బీఎల్ఏలు) సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించాలని పేర్కొన్నారు. ఓటర్లందరికీ ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఫారాలను సక్రమంగా నింపి నిర్ణీత గడువులోగా సమర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. అవసరమైన పత్రాలపై కూడా ఓటర్లకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని బండారి లక్ష్మారెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక పర్యవేక్షణ

**జోగులాంబ గద్వాల, జూన్ 29**



ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేలా మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులతో ఆయన పలు అంశాలపై చర్చించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని సమర్థవంతంగా నిర్వహించేలా ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యాలయాలు, ప్రభుత్వ వసతి గృహాలను సంబంధిత అధికారులు తరచూ సందర్శిస్తూ అక్కడి పరిస్థితులను పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును కూడా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. చిన్నారులు, విద్యార్థులకు అందుతున్న సేవల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రతి మండలంలో మూడు చొప్పున ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.



## అదనపు డీసీపీ రవికి ఘన వీడ్కోలు

**వరంగల్, జూన్ 29**

వరంగల్ పోలీసు కమిషనరేట్ అదనపు డీసీపీ (పరిపాలన) రేవూరి రవి పదవీ విరమణ సందర్భంగా సోమవారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పాల్గొని రేవూరి రవి అందించిన సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రేవూరి రవి తన విధుల్లో ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేశారని తెలిపారు. పోలీసు సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ, అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. ఆయన సేవలు పోలీసు శాఖకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. పరిపాలనా విభాగంలో విధులు నిర్వహించిన కాలంలో క్రమశిక్షణ, సమన్వయం, బాధ్యతాయుతమైన వ్యవహారశైలితో రేవూరి రవి ప్రత్యేక గుర్తింపు పొందారని సీపీ పేర్కొన్నారు. శాఖ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తెలిపారు. అనంతరం సీపీ సన్‌ప్రీత్ సింగ్ రేవూరి రవిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. పదవీ విరమణ అనంతర జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. సహచర అధికారులు కూడా ఆయనకు అభినందనలు తెలియజేశారు. రేవూరి రవి మాట్లాడుతూ తనకు సహకరించిన పోలీసు ఉన్నతాధికారులు, సహచర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేసిన అనుభవాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. అందరి సహకారంతోనే తన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించగలిగానని అన్నారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు చెందిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన అదనపు డీసీపీ రేవూరి రవికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన సేవలను స్మరించుకున్నారు.



### ప్రజలకు సత్వర న్యాయం అందించాలి: ఎస్పీ శబరీష్

**మహబూబాబాద్, జూన్ 29**

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి న్యాయం అందించాలని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ శబరీష్, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం తొర్రూరు డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన అక్కడి పనితీరును సమీక్షించి పెండింగ్ కేసులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీసు సేవల్లో పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానాన్ని పాటించాలని సూచించారు. అనంతరం చింతలపల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత, బ్యాంకు వివరాలు వెల్లడించవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, సందేశాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. గంజాయి నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. గ్రామాల్లో గంజాయి సాగు, విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# ఐర్లాండ్ చేతిలో టీమిండియా క్లీన్‌స్వీప్

బెల్‌ఫాస్ట్, జూన్ 29

ఐర్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో ఒక్క పరుగు తేడాతో ఓడిన భారత జట్టు రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 0–2తో చేజార్చుకుంది. ఈ ఓటమితో టీ20ల్లో భారత్ కొనసాగించిన 16 సిరీస్‌ల అజేయ పరంపరకు ముగింపు పడింది. మ్యాచ్ అనంతరం భారత సహాయ కోచ్ ర్యాన్ డోస్కేట్ మాట్లాడుతూ, వరుసగా రెండు ప్రపంచకప్‌లు గెలిచిన భారత జట్టును ఒక్క సిరీస్ ఆధారంగా అంచనా వేయడం సరైంది కాదన్నారు. స్థానిక పిచ్ పరిస్థితులను అర్థం చేసుకోవడంలో టీమిండియా విఫలమైందని అంగీకరించారు. ఐపీఎల్‌లోని ఫ్లాట్ పిచ్‌ల నుంచి బెల్‌ఫాస్ట్‌లోని పెద్ద బౌండరీలు, బౌలర్లకు అనుకూలమైన వికెట్లకు అలవాటు పడటంలో భారత బ్యాటర్లు ఇబ్బంది పడ్డారని చెప్పారు. ఐర్లాండ్ మాత్రం స్థానిక పరిస్థితులను చక్కగా వినియోగించుకుని తెలివిగా ఆడిందని ప్రశంసించారు. 154 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 153




పరుగులకే 9 వికెట్లు కోల్పోయి ఒక్క పరుగు తేడాతో ఓటమి చవిచూసింది. తిలక్ వర్మ 55 పరుగులతో పోరాడగా, హర్షిత్ రాణా 21 పరుగులు చేసి చివరి వరకు ఆశలు నిలబెట్టాడు. మిగతా బ్యాటర్లు మరోసారి విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో భారత సంతతికి చెందిన జై మూంద్రా, మాథ్యూ హాలార్డ్ చెరో మూడు వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించారు. జై మూంద్రా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును కూడా అందుకున్నాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 154 పరుగులు చేసింది. హ్యారీ టెక్టర్ 53, బెంజిమిన్ 37 పరుగులతో రాణించగా, భారత బౌలర్ ప్రిన్స్ యాదవ్ మూడు వికెట్లు పడగొట్టాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంకా అభివృద్ధి చెందుతున్న జట్టుగా భావించే ఐర్లాండ్, వరుసగా రెండు మ్యాచ్‌ల్లోనూ అద్భుత ప్రదర్శన చేసి ప్రపంచ ఛాంపియన్ భారత జట్టును క్లీన్‌స్వీప్ చేయడం విశేషంగా నిలిచింది.

# అర్జెంటీనాకు సులువైన దారి.. నాకౌట్‌లో హోరాహోరీ పోరు

ముంబై జూన్ 29

ఫిఫా ప్రపంచకప్ 2026 గ్రూప్ దశ ముగియడంతో నాకౌట్ పోరుకు అర్హత సాధించిన 32 జట్లు ఖరారయ్యాయి. విడుదలైన నాకౌట్ షెడ్యూల్ ఫుట్‌బాల్ అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాకు ఫైనల్ వరకు మార్గం సులువుగా కనిపిస్తుండగా, మరోవైపు జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్ వంటి అగ్రశ్రేణి జట్లు ఒకే బ్రాకెట్‌లో ఉండటంతో హోరాహోరీ పోరు ఖాయమైంది. గ్రూప్ దశలో అర్జెంటీనా మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి అగ్రస్థానంలో నిలిచింది. కెప్టెన్ లియోనెల్ మెస్సీ అద్భుత ఫామ్‌లో కొనసాగుతూ ప్రతి మ్యాచ్‌లో గోల్స్‌తో జట్టును విజయపథంలో నడిపించాడు. ఫ్రాన్స్, మెక్సికో కూడా గ్రూప్ దశను అపజయం లేకుండా ముగించాయి. అయితే జర్మనీ చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఈక్వెడార్ చేతిలో ఓటమి పాలవగా, బ్రెజిల్, పోర్చుగల్, ఇంగ్లండ్, స్పెయిన్ జట్లు కూడా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాయి. అర్జెంటీనాకు అనుకూల డ్రా రౌండ్ 32లో అర్జెంటీనా కేప్ వెర్డేతో తలపడనుంది. ఆ మ్యాచ్‌లో విజయం సాధిస్తే రౌండ్ ఆఫ్ 16లో ఈజిప్ట్ లేదా



ఆస్ట్రేలియా జట్టుతో తలపడే అవకాశం ఉంది. అనంతరం క్వార్టర్ ఫైనల్లో స్విట్జర్లాండ్, కొలంబియా, ఘనా లేదా అల్జీరియాలో ఏదో ఒక జట్టు ప్రత్యర్థిగా వచ్చే అవకాశం ఉంది. దీంతో సెమీఫైనల్ వరకు అర్జెంటీనాకు పెద్దగా గట్టి సవాల్ ఎదురయ్యే పరిస్థితి కనిపించడం లేదు. యూరప్ జట్ల మధ్య కఠిన పోటీ మరోవైపు నాకౌట్ బ్రాకెట్‌లో ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, పోర్చుగల్, నెదర్లాండ్స్, బెల్జియం వంటి బలమైన జట్లు ఒకే వైపు చేరాయి. రౌండ్ ఆఫ్ 16 నుంచే ఫైనల్‌ను తలపించే మ్యాచ్‌లు జరిగే అవకాశముంది. జర్మనీ–ఫ్రాన్స్, స్పెయిన్–పోర్చుగల్ వంటి పోరుల్లో ఒక అగ్రశ్రేణి జట్టు తప్పక టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో అర్జెంటీనాకు ఫైనల్ చేరే అవకాశాలు మెరుగ్గా కనిపిస్తుండగా, యూరప్ జట్లు మాత్రం ప్రతి మ్యాచ్‌ను ఫైనల్‌లా ఆడాల్సిన పరిస్థితి నెలకొంది.

# అర్జెంటీనాకు సులువైన దారి.. నాకౌట్‌లో హోరాహోరీ పోరు

డబ్లిన్ -- జూన్ 29, 2026

టీ20 ప్రపంచ ఛాంపియన్ భారత్ ఐర్లాండ్ చేతిలో 0–2తో సిరీస్ కోల్పోవడంతో 15 ఏళ్ల బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీని జట్టులోకి ఎందుకు తీసుకోలేదనే చర్చ జోరందుకుంది. ఈ అంశంపై భారత జట్టు అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డచ్‌కేట్ స్పందించారు. వైభవ్ అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, జట్టులో స్థానం సంపాదించాలంటే అందరిలాగే ఒక ప్రక్రియను అనుసరించాల్సిందేనని స్పష్టం చేశారు. ఐర్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత్ ఒక్క పరుగు తేడాతో ఓడిన అనంతరం మీడియాతో మాట్లాడిన డచ్‌కేట్, “వైభవ్ ప్రతిభపై ఎలాంటి సందేహం లేదు. అయితే ప్రపంచకప్ విజయంలో కీలక పాత్ర పోషించిన సంజూ శాంసన్ వంటి ఆటగాళ్లకు కూడా అవకాశాలు కొనసాగించాల్సిన బాధ్యత జట్టు యాజమాన్యంపై ఉంటుంది. ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం పెంచుతూ వారికి సుదీర్ఘ అవకాశాలు ఇవ్వడమే మా విధానం. వైభవ్‌కు కూడా అవకాశం వస్తుంది.



కానీ అతను కూడా అదే ప్రక్రియను దాటుకుని రావాలి” అని తెలిపారు. ఈ ఏడాది ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. 230కు పైగా స్ట్రైక్‌రేట్‌తో 776 పరుగులు చేసి టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలవడంతో పాటు ‘మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్’, ‘ఎమర్జింగ్ ప్లేయర్’ అవార్డులను సొంతం చేసుకున్నాడు. ఇంతటి ఫామ్‌లో ఉన్న ఆటగాడికి అవకాశం ఇవ్వకపోవడంపై క్రీడా వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. భారత జట్టు తదుపరి టీ20 సిరీస్ కోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. జులై 1 నుంచి చెస్టర్–లీ–స్ట్రీట్‌లో సిరీస్ ప్రారంభం కానుంది. ఈ పర్యటనలో వైభవ్‌కు అరంగేట్రం చేసే అవకాశం లభిస్తే, భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో అంతర్జాతీయ క్రికెట్ ఆడిన ఆటగాడిగా సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమించే అవకాశం ఉంది. ప్రస్తుతం అభిమానుల దృష్టి అంతా జట్టు ఎంపికపైనే నిలిచింది.

## హర్మన్‌ప్రీత్‌కే కోచ్ మద్దతు.. నాయకత్వంపై తుది నిర్ణయం సెలెక్టర్లదే

లండన్ -- జూన్ 29, 2026 -

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో గ్రూప్ దశలోనే భారత్ నిష్క్రమించడంతో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే భారత మహిళల జట్టు ప్రధాన కోచ్ అమోల్ ముజుందార్, మాజీ కెప్టెన్ అంజుమ్ చోప్రా హర్మన్‌ప్రీత్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు. ఆస్ట్రేలియాతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఓటమి అనంతరం మీడియాతో మాట్లాడిన కోచ్ అమోల్ ముజుందార్, హర్మన్‌ప్రీత్ భారత జట్టు కెప్టెన్‌గా కొనసాగాలని తాను కోరుకుంటున్నానని తెలిపారు. అయితే నాయకత్వంపై తుది నిర్ణయం సెలెక్టర్లదేనని స్పష్టం చేశారు. మరోవైపు మాజీ కెప్టెన్ అంజుమ్ చోప్రా కూడా హర్మన్‌ప్రీత్‌కు మద్దతు పలికారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత జట్టును నడిపించడానికి ఆమె కంటే మెరుగైన ప్రత్యామ్నాయం కనిపించడం లేదని అభిప్రాయపడ్డారు. డబ్ల్యూ పీఎల్‌లో చూపించే దూకుడును భారత టాప్ ఆర్డర్ బ్యాటర్లు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ప్రదర్శించ లేకపోతున్నారని అంజుమ్ పేర్కొన్నారు. భయపడకుండా ఆదే ధోరణిని అలవర్చుకోవాలని, 180 పరుగులకు పైగా స్కోరు చేసే సామర్థ్యం ఉన్న బ్యాటర్లను తయారు చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. లార్డ్స్‌లో జరి గిన కీలక మ్యాచ్‌లో భారత్ నిర్దేశించిన 170 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా ఎల్లీస్ పెర్రీ, యాష్లే గార్డనర్ అద్భుత భాగస్వామ్యంతో ఛేదించి సెమీఫైనల్‌కు చేరుకోగా, టీమిండియా గ్రూప్ దశలోనే టోర్నీకి వీడ్కోలు పలికింది.




# స్టోక్స్ రిటైర్మెంట్‌పై వివరణ.. ఎవరూ ఒత్తిడి చేయలేదు


లండన్ -- జూన్ 29, 2026 -

ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంపై వస్తున్న ఊహాగా నాలకు ఆయన స్వయంగా తెరదించారు. నైట్‌క్లబ్ వివాదం కారణంగా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు తనపై రిటైర్మెంట్ ఒత్తిడి తీసుకొచ్చిందన్న ప్రచారాన్ని స్టోక్స్ ఖండించారు. రిటైర్మెంట్ పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమేనని, ఎవరూ బలవంతం చేయలేదని స్పష్టం చేశారు. మూడో టెస్టు అనంతరం మీడియాతో మాట్లాడిన స్టోక్స్, గత ఏడాది ఆస్ట్రేలియాతో జరిగిన యాషెస్ సిరీస్‌లో 4–1 తేడాతో ఓటమి తర్వాతే తాను తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యానని చెప్పారు. ఆ పరిస్థితి నుంచి బయటపడేందుకు ప్రయత్నించినప్పటికీ పూర్తిగా కోలుకోలేకపోయానని వెల్లడించారు. నైట్‌క్లబ్ వివాదం కూడా తనపై ప్రభావం చూపిందని, డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న సమయంలో తాను మానసికంగా ఎంతగా అలసిపోయానో అర్థమైందని స్టోక్స్ పేర్కొన్నారు. గత రెండు వారాలు తన జీవితంలో అత్యంత కఠినమైన రోజులుగా గడిచాయని తెలిపారు. న్యూజిలాండ్‌తో రెండో టెస్టుకు తనపై వేటు పడిన తర్వాత కౌంటీ జట్టు దర్హమ్ తరఫున ఆడానని, అక్కడ మళ్లీ క్రికెట్‌ను ఆస్వాదించగలిగానని చెప్పారు. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో అదే అనుభూతి కలగలేదని వివరించారు.






రిటైర్మెంట్ నిర్ణయంలో కొంత వ్యక్తిగత ఆలోచన కూడా ఉందని స్టోక్స్ తెలిపారు. భవిష్యత్తులో జట్టుకు ఇది మేలు చేస్తుందని ఆశిస్తున్నానని, తన జీవితానికి ఎంతో ఇచ్చిన క్రికెట్‌పై ప్రేమ తగ్గిపోకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని వెల్లడించారు.



## కేప్ వెర్డే కెప్టెన్‌పై అత్యాచార ఆరోపణలు

ఆక్లాండ్, జూన్ 29

ఫిఫా ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శనతో నాకౌట్‌కు చేరిన కేప్ వెర్డే జట్టుకు ఊహించని వివాదం ఎదురైంది. ఆ జట్టు కెప్టెన్ ర్యాన్ మెండిస్‌పై ఓ బ్రెజిల్ మహిళ అత్యాచార ఆరోపణలు చేయడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఈ కేసుపై న్యూజిలాండ్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఫిఫా ప్రపంచకప్‌కు సన్నాహకంగా ఆక్లాండ్‌లో జరిగిన మ్యాచ్‌ల సందర్భంగా బాధిత మహిళ కేప్ వెర్డే జట్టుకు అనువాదకురాలిగా విధులు నిర్వహించినట్లు సమాచారం. చిలీతో మ్యాచ్ ముగిసిన అనంతరం తన హోటల్ గదిలోకి ర్యాన్ మెండిస్ అనుమతి లేకుండా ప్రవేశించి, తనపై దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుతో పాటు గాయాలకు సంబంధించిన చిత్రాలు, ఇతర ఆధారాలను కూడా ఆమె పోలీసులకు సమర్పించినట్లు తెలుస్తోంది. అనంతరం ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించడంతో పాటు బాధిత మహిళకు కౌన్సెలింగ్ కూడా అందించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నమోదు చేసిన ఫిర్యాదుపై విచారణ కొనసాగుతోందని న్యూజిలాండ్ పోలీసులు వెల్లడించారు. హోటల్ సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నామని, కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉన్నందున ఎవరినీ దోషిగా నిర్ధారించలేమని తెలిపారు. కోర్టు విచారణ అనంతరమే తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఫిఫా కూడా స్పందించింది. ఆటగాళ్ల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతున్నామని, ఈ వ్యవహారంలో న్యూజిలాండ్ అధికారులతో సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. ఇదిలా ఉండగా, ప్రపంచకప్ నాకౌట్ దశలో కేప్ వెర్డే జట్టు అర్జెంటీనాతో తలపడనుంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు కెప్టెన్‌పై వచ్చిన ఆరోపణలు జట్టుపై ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.




## రోహిత్ యాదవ్ సంచలనం.. 87.05 మీటర్ల త్రోతో చరిత్ర

లక్నో, జూన్ 29

భారత జావెలిన్ త్రోయర్ రోహిత్ యాదవ్ జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శనతో కొత్త రికార్డు నెలకొల్పాడు. నేషనల్ ఇంటర్–స్టేట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల జావెలిన్ త్రో విభాగంలో 87.05 మీటర్ల దూరం జావెలిన్ విసిరి అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఈ ప్రదర్శనతో 2026లో ఆసియా ఖండంలో రెండో అత్యుత్తమ జావెలిన్‌త్రో నమోదు చేసిన అథ్లెట్‌గా రోహిత్ నిలిచాడు. అంతేకాకుండా భారత జావెలిన్ త్రో చరిత్రలో 87 మీటర్ల మార్కును దాటిన మూడో భారతీయుడిగా అరుదైన ఘనత సాధించాడు. ఇంతకుముందు ఒలింపిక్ స్వర్ణ విజేత నీరజ్ చోప్రా, జాతీయ అథ్లెట్ కిశోర్ జెనా మాత్రమే ఈ ఘనత సాధించారు. ఇప్పుడు రోహిత్ యాదవ్ కూడా ఆ జాబితాలో చేరడం భారత అథ్లెటిక్స్‌కు మరో శుభపరిణామంగా భావిస్తున్నారు. రోహిత్ తాజా ప్రదర్శనతో అంతర్జాతీయ టోర్నీల్లో భారత్‌కు పతకాలు అందించే అథ్లెట్‌గా తన సామర్థ్యాన్ని మరోసారి నిరూపించాడు. ఆయన విజయంపై క్రీడా ప్రముఖులు, అభిమానులు సామాజిక మాధ్యమాల్లో అభినందనలు తెలియజేస్తున్నారు.



## ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు..
# ఇంధన ధరలపై ప్రభావం

**హైదరాబాద్, జూన్ 29**

అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావంతో ముడి చమురు మార్కెట్‌లో తీవ్ర హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. హోర్ముజ్ జలసంధి సమీపంలో ఖతార్‌కు చెందిన ముడి చమురు రవాణా నౌకపై జరిగిన దాడి, అనంతరం ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా చేపట్టిన చర్యలతో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి.అయితే పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ఇరు దేశాలు దాడులను నిలిపివేసి దోహాలో చర్చలకు అంగీకరించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో కొంత ఊరట కనిపించింది. దీంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 73.39 డాలర్లకు చేరుకున్నప్పటికీ, అనంతరం స్వల్పంగా తగ్గింది. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల సమీపంలో కొనసాగుతోంది. హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకాయానం కొనసాగుతున్నప్పటికీ, పర్షియన్ గల్ఫ్‌లో వందలాది నౌకలు నిలిచిపోవడంతో కొన్ని చమురు ట్యాంకర్లు తమ ప్రయాణాలను తాత్కాలికంగా నిలిపివేశాయి. దీంతో ప్రపంచ చమురు సరఫరాపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో దేశీయంగా కూడా ఇంధన ధరలు పెరిగాయి. అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగు దఫాల్లో పెరిగి లీటరుకు సుమారు రూ.7.50 నుంచి రూ.8 వరకు అదనపు భారం పడింది. ప్రస్తుతం ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.102.12, డీజిల్ ధర రూ.95.20గా ఉంది. హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.73, డీజిల్ రూ.103.82గా నమోదైంది. కోల్‌కతాలో పెట్రోల్ రూ.113.51, డీజిల్ రూ.99.82గా ఉండగా, ముంబైలో పెట్రోల్ రూ.111.21, డీజిల్ రూ.97.83గా ఉన్నాయి.




## ఏరోమార్ట్ సదస్సుకు
# హైదరాబాద్ సిద్ధం

**హైదరాబాద్, జూన్ 29**

తెలంగాణ రాజధాని హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుంది. జూన్ 30 నుంచి జూలై 2 వరకు మూడు రోజుల పాటు 'ఏరోమార్ట్ హైదరాబాద్--2026' సదస్సు జరగనుంది. తెలంగాణ ప్రభుత్వం, బీసీఐ ఏరోస్పేస్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా విమానయానం, రక్షణ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయి. ఈ కార్యక్రమానికి 25 దేశాల నుంచి 400కుపైగా అంతర్జాతీయ సంస్థలు, రక్షణ రంగ నిపుణులు హాజరవుతున్నారు. దాదాపు 1,200 మంది ప్రతినిధులు పాల్గొని ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో వస్తున్న సాంకేతిక మార్పులు, ఆవిష్కరణలు, పరిశ్రమల అభివృద్ధిపై చర్చించనున్నారు. ఈ సదస్సు తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించడంలో కీలకంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు. స్థానిక పరిశ్రమలు విదేశీ సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పరుచుకునేందుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఇది మంచి అవకాశంగా నిలవనుంది. సదస్సు ద్వారా రాష్ట్రంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో కొత్త పరిశ్రమలు, స్టార్టప్‌లు ఏర్పడి యువతకు పెద్దఎత్తున నైపుణ్యాధారిత ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. భారత్ రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యానికి ఈ సదస్సు మరింత బలాన్ని చేకూర్చనుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

AEROMART
HYDERABAD - INDIA

# తగ్గిన బంగారం ధరలు.. వెండి స్థిరం

**హైదరాబాద్, జూన్ 29**

బంగారం ధరలు సోమవారం స్వల్పంగా తగ్గాయి. ఉదయం 10 గంటల సమయా నికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,020గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,31,100గా ఉంది. వెండి ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదు. తెలంగాణలో హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,020గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,31,100గా నమోదైంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,07,270గా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలో కూడా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,020, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,31,100, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,07,270గా నమోదైంది. దేశంలోని



ప్రధాన నగరాల్లో చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,090, 22 క్యారెట్ల ధర రూ.1,33,000గా ఉంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల ధర రూ.1,43,170, 22 క్యారెట్ల ధర రూ.1,31,250గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,020గా ఉండగా, అహ్మదాబాద్‌లో రూ.1,43, 070గా నమోదైంది.

# స్థిరంగా పెట్రోల్, డీజిల్ ధరలు

**హైదరాబాద్, జూన్ 29**

దేశీయ చమురు సంస్థలు మంగ ళవారం పెట్రోల్, డీజిల్ ధరలను యథాతథంగా కొనసాగించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, రవాణా వ్యయాలు, రాష్ట్రాల పన్నులను పరిగణనలోకి తీసుకుని ప్రతిరోజూ ఉదయం ఇంధన ధరలను ప్రకటిస్తుంటాయి. తెలంగాణలో గత కొన్ని రోజులుగా ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.69గా, డీజిల్ ధర రూ.103.82గా కొనసాగుతోంది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం తదితర నగరాల్లో స్థానిక పన్నుల కారణంగా స్వల్ప తేడాలు ఉన్నప్పటికీ ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇంధన ధరలు మారలేదు. విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.51గా, డీజిల్ ధర రూ.105.20గా కొనసాగుతోంది.




విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు తదితర ప్రాంతాల్లో కూడా స్వల్ప వ్యత్యాసాలతో ఇదే స్థాయిలో ధరలు నమోదవుతున్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో పెద్దగా మార్పులు లేకపోవడంతో దేశీయ మార్కెట్‌లో కూడా పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయని చమురు రంగ నిపుణులు పేర్కొంటున్నారు.




## జూలై 1 నుంచి కొత్త
# నిబంధనలు

**న్యూఢిల్లీ, జూన్ 29**

జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా బ్యాంకింగ్, పన్నులు, ఆధార్, పాస్‌పోర్ట్, క్రెడిట్ కార్డులకు సంబంధించిన పలు కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు సామాన్య ప్రజల ఆర్థిక లావాదేవీలపై ప్రభావం చూపనున్నాయి. ఐటీఆర్ దాఖలుకు గడువు 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్నులను జూలై 31లోగా దాఖలు చేయాలి. ఐటీఆర్--1, ఐటీఆర్--2 దాఖలు చేసే పన్ను చెల్లింపుదారులకు ఈ గడువు వర్తిస్తుంది. నిర్ణీత గడువు దాటితే జరిమానాతో పాటు కొన్ని పన్ను రాయితీలు కోల్పోయే అవకాశం ఉంది. ఆధార్‌లో ఉచిత ఈ-మెయిల్ అప్‌డేట్ ఆధార్‌లో నమోదు చేసిన ఈ-మెయిల్ చిరునామాను ఇకపై ఉచితంగా మార్చుకునే అవకాశం కల్పించారు. ఆధార్ మొబైల్ అనువర్తనం ద్వారా ఈ సేవను 2026 డిసెంబర్ 31 వరకు ఎలాంటి రుసుము లేకుండా పొందవచ్చు. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులకు కొత్త నిబంధనలు ఫోన్‌పే--ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుల రివార్డు పాయింట్ల విధానంలో మార్పులు చేశారు. కొన్ని లావాదేవీలపై ఇకపై రివార్డు పాయింట్లు ఇవ్వరు. అలాగే నిర్దేశిత ఖర్చు పరిమితిని దాటిన తర్వాత మాత్రమే పాయింట్లు లభిస్తాయి. ఈ మార్పులు ఎంపిక చేసిన కార్డులకు మాత్రమే వర్తిస్తాయి. హెచ్‌డీఎఫ్‌సీ లాంజ్ సదుపాయంలో మార్పు హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు వినియోగదారులు ఒక త్రైమాసికంలో మూడు ఉచిత విమానాశ్రయ లాంజ్ ప్రవేశాలు పొందాలంటే, అంతకుముందు త్రైమాసికంలో కనీసం రూ.60 వేల వరకు ఖర్చు చేసి ఉండాలి.

## బలహీనంగా లిస్ట్ అయిన ఐపీఓ.. ఇన్వెస్టర్లకు
# నిపుణుల హెచ్చరిక

**హైదరాబాద్, జూన్ 29**

ఇటీవల స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన ఓ ఫిన్‌టెక్ కంపెనీ షేర్లు అంచనాలకు తగ్గట్టుగా రాణించక పోవడంతో పెట్టుబడిదారులు నిరాశ చెందారు. జూన్ 29న జాతీయ, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఈ కంపెనీ షేర్లు ఐపీఓ ధరతో పోలిస్తే సుమారు 11 శాతం తగ్గుదలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. రూ.883 కోట్ల విలువైన ఈ ఐపీఓను ఒక్కో షేరుకు రూ.144 నుంచి రూ.152 ధరల మధ్య అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే లిస్టింగ్ రోజే షేర్లు తగ్గుదలతో ప్రారంభం కావడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన వ్యక్తమైంది. కంపెనీ ఆర్థిక పరిస్థితి, ప్రతికూల రాబడి నిష్పత్తి వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను క్లౌడ్ మౌలిక సదుపాయాల విస్తరణ, సాంకేతిక బృందం బలోపేతం, మార్కెటింగ్, వ్యాపార విస్తరణకు వినియోగించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. లక్షలాది బీమా సలహాదారుల ద్వారా కోట్ల సంఖ్యలో పాలసీలు విక్రయించినప్పటికీ ఆదాయంలో గణనీయమైన తగ్గుదల నమోదవడం పెట్టుబడిదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. కంపెనీ వ్యయాల్లో అధిక భాగం డిజిటల్ భాగస్వామ్య ఖర్చులకే వెళ్తుండటంతో సమీప భవిష్యత్తులో లాభదాయకత సాధించడం సవాలుగా మారే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




# గ్యాస్ వినియోగదారులకు కొత్త నిబంధనలు

**న్యూఢిల్లీ, జూన్ 29**

దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులకు జూలై 1 నుంచి కొన్ని కీలక నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ముఖ్యంగా పైప్‌లైన్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో నివసించే వారు, ఇంకా ఈ-కేవైసీ పూర్తి చేయని వినియోగదారులు కొత్త మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఇప్పటికే ఇంట్లో పైప్‌లైన్ గ్యాస్ కనెక్షన్ ఉండి, అదనంగా ఎల్‌పీజీ కనెక్షన్ వినియోగిస్తున్న వారు నిర్ణీత గడువులోగా ఎల్‌పీజీ కనెక్షన్‌ను సరెండర్ చేయాల్సి ఉంటుంది. ఒకే ఇంట్లో రెండు గ్యాస్ కనెక్షన్లకు అనుమతి ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. స్వచ్ఛందంగా ఎల్‌పీజీ కనెక్షన్‌ను సరెండర్ చేసిన వారికి ప్రత్యేక కూపన్ అందజేస్తారు. భవిష్యత్తులో అవసరమైతే అదే కూపన్‌తో తిరిగి కనెక్షన్ పొందే అవకాశం ఉంటుంది. పైప్‌లైన్ గ్యాస్ సదుపాయం ఉన్న ప్రాంతాల్లో ఎల్‌పీజీ వినియోగదారులు నిర్ణయించిన గడువులోగా పీఎన్‌జీ కనెక్షన్‌కు మారాలని




ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. మార్చిలో ప్రకటించిన మూడు నెలల గడువు జూన్ నెలాఖరుతో ముగియనుండటంతో, మారని వారి కనెక్షన్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఎల్‌పీజీ వినియోగదారులందరికీ ఈ-కేవైసీ పూర్తి చేయడం తప్పనిసరి. జూన్ 30లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని వారికి జూలై 1 నుంచి గ్యాస్ సేవలు లేదా సిలిండర్ బుకింగ్‌లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.



## ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఈక్విటీ
# మార్కెట్‌గా భారత్

**హైదరాబాద్, జూన్ 29**

భారత ఈక్విటీ మార్కెట్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. దేశీయ మార్కెట్ మొత్తం విలువ 5 ట్రిలియన్ డాలర్ల మార్క్‌ను దాటడంతో ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా భారత్ మళ్లీ తన స్థానాన్ని దక్కించుకుంది. తైవాన్, దక్షిణ కొరియా మార్కెట్లను వెనక్కి నెట్టి ఈ ఘనత సాధించింది. ఇటీవలి కాలంలో ప్రపంచ మార్కెట్లు ఒడిదు డుకులను ఎదుర్కొంటున్నప్పటికీ, భారత మార్కెట్ స్థిరమైన వృద్ధిని నమోదు చేసింది. జూన్ నెలలో భారత మార్కెట్ విలువ 2.75 శాతం పెరగగా, తైవాన్ మార్కెట్ 2.3 శాతం, దక్షిణ కొరియా మార్కెట్ 4.7 శాతం క్షీణించాయి. ప్రస్తుతం భారత్ మార్కెట్ విలువ 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకోగా, తైవాన్ 4.97 ట్రిలియన్ డాలర్లు, దక్షిణ కొరియా 4.66 ట్రిలియన్ డాలర్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గత కొంతకాలంగా కృత్రిమ మేధ, సెమీకండక్టర్ రంగాల షేర్లతో భారీ లాభాలు పొందిన తైవాన్, దక్షిణ కొరియా మార్కెట్లలో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో అక్కడ మార్కెట్లు బలహీనపడ్డాయి. అదే సమయంలో భారత మార్కెట్‌కు విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగడం సానుకూల ప్రభావం చూపింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గడం, విదేశీ పెట్టుబడులు పెరగడం, మార్కెట్ విలువలు ఆకర్షణీయ స్థాయికి చేరడం వంటి అంశాలు భారత మార్కెట్‌కు బలాన్నిస్తున్నాయని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. నిఫ్టీ ధర-ఆదాయ నిష్పత్తి తగ్గడం కూడా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచిందని విశ్లేషిస్తున్నారు.




## రూ.5 లక్షల్లో కొత్త రెనో క్విడ్.. త్వరలో
# విడుదల

**హైదరాబాద్, జూన్ 29**

తక్కువ ధరలో కొత్త కారు కొనాలనుకునే వినియోగదారులకు రెనో ఇండియా శుభవార్త చెప్పింది. సంస్థ తన సరికొత్త రెనో క్విడ్ ఫేస్‌లిఫ్ట్ మోడల్‌ను వచ్చే నెల 3వ తేదీన విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ కారు ప్రారంభ ధర రూ.4.80 లక్షల నుంచి రూ.5.50 లక్షల మధ్య ఉండే అవకాశం ఉందని సమాచారం.కొత్త క్విడ్‌లో ఆకర్షణీయమైన బాహ్య రూపకల్పన, కొత్త గ్రిల్, వై ఆకారంలోని ఎల్‌ఈడీ డీఆర్‌ఎల్‌లతో హెడ్‌ల్యాంప్‌లు, కొత్త బంపర్, వెనుక భాగంలో కొత్త టెయిల్ ల్యాంప్‌లను అందించనున్నట్లు తెలుస్తోంది. నగర ప్రయాణాలకు అనువుగా ఉండే ఎస్‌యూవీ తరహా రూపంతో ఈ కారు రానుంది. అంతర్గత భాగంలో సుమారు 10 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ వ్యవస్థ, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, స్టీరింగ్ మౌంటెడ్ నియంత్రణలు, కొత్త డ్యాష్‌బోర్డ్, మెరుగైన సీటు వస్త్రాలను అందించే అవకాశం ఉంది. ఇంజిన్‌లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రస్తుతం ఉన్న 1.0 లీటర్, మూడు సిలిండర్ల పెట్రోల్ ఇంజిన్‌నే కొనసాగించనున్నారు. ఐదు వేగాల మాన్యువల్, ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఎంపికలు ఉండనున్నాయి. లీటరుకు సుమారు 22 కిలోమీటర్ల వరకు మైలేజీ లభించే అవకాశం ఉంది. భద్రత పరంగా ద్వంద్వ ఎయిర్‌బ్యాగ్‌లు, ఏబీఎస్‌తో కూడిన ఈబీడీ, వెనుక పార్కింగ్ సెన్సార్లు తదితర భద్రతా సౌకర్యాలను అందించనున్నారు.

## యూట్యూబ్‌లో బెల్లంకొండ రికార్డు..
## బిలియన్ వ్యూస్ దాటిన
# 'జయ జానకి నాయక'

హైదరాబాద్, జూన్ 29

యువ కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన సినీ ప్రయాణంలో అరుదైన డిజిటల్ ఘనతను సొంతం చేసుకున్నారు. దర్శకుడు బోయపాటి శ్రీను తెరౕకెక్కించిన 'జయ జానకి నాయక' చిత్రం హిందీ డబ్బింగ్ రూపంలో యూట్యూబ్‌లో ఏకంగా 100 కోట్ల (ఒక బిలియన్) వ్యూస్ సాధించి కొత్త రికార్డు నెలకొల్పింది. 'ఖుంఖార్' పేరుతో ప్రముఖ యూట్యూబ్ ఛానెల్‌లో విడుదలైన ఈ చిత్రం, విడుదలై ఎన్నేళ్లు గడిచినా ప్రేక్షకా దరణను కోల్పోకుండా క్రమంగా వ్యూస్ పెంచుకుంటూ బిలియన్ మార్క్‌ను అందుకుంది. దీంతో యూట్యూబ్‌లో ఈ ఘనత సాధించిన తెలుగు చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ విజయంతో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పేరు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. హిందీలో డబ్ చేసిన పూర్తి నిడివి గల తెలుగు సినిమాతో యూట్యూబ్‌లో బిలియన్ వ్యూస్ సాధించిన తొలి తెలుగు హీరోగా ఆయన గుర్తింపు పొందారు. ఈ చిత్రంలో రకుల్ ప్రీత్ సింగ్ కథానాయికగా నటించగా, జగపతిబాబు, శరత్ కుమార్ కీలక పాత్రలు పోషించారు. థియేటర్లలో మంచి విజ యాన్ని అందుకున్న ఈ చిత్రం, డిజిటల్ వేదికలపై మాత్రం అసాధారణ ఆదరణను దక్కించుకుంది. ఇటీవల ఈ సినిమాలోని ఓ భావోద్వేగ డైలాగ్ సామాజిక మాధ్య మాల్లోని చిన్న వీడియోల ద్వారా విస్తృతంగా ప్రాచుర్యం పొందడంతో చిత్రానికి మరింత ఆదరణ లభించింది. దీంతో యూట్యూబ్‌లో వ్యూస్ సంఖ్య వేగంగా పెరిగింది. విడుదలై దాదాపు ఏడేళ్లు గడిచినా ఈ చిత్రానికి ఇప్పటికీ లక్షల సంఖ్యలో వీక్షణలు వస్తుండటం విశేషం. ముఖ్యంగా ఉత్తర భారత ప్రేక్షకుల్లో ఈ యాక్షన్ చిత్రానికి ఉన్న ఆదరణ మరోసారి స్పష్టమైంది. ఒకప్పుడు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న 'జయ జానకి నాయక' ఇప్పుడు డిజిటల్ ప్రపంచంలో చరిత్ర సృష్టిస్తూ బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు అరుదైన గుర్తింపును తీసుకొచ్చింది.







## దిల్‌రుబా
## భామ రుక్సార్ ధిల్లాన్
# అందాల సందడి

హైదరాబాద్ -- జూన్ 29, 2026


'దిల్‌రుబా' చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన నటించిన రుక్సార్ ధిల్లాన్ తన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. 2015లో విడుదలైన కన్నడ చిత్రం 'కట్టె' ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన రుక్సార్, 2016లో 'రన్ ఆంటోని' సినిమాతో గుర్తింపు పొందారు. అనంతరం 'ఆకతాయి' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టారు. తెలుగులో 'కృష్ణార్జున యుద్ధం', 'ఏబీసీడీ: అమెరికన్ బోర్న్ కన్ఫ్యూజ్డ్ దేశి', 'అశోక వనంలో అర్జున కళ్యాణం' చిత్రాలతో మంచి గుర్తింపు సంపాదించారు. అలాగే హిందీలో 'భాంగ్రా పా లే', 'జాదుగర్' చిత్రాల్లోనూ నటించారు. ఇటీవల 'నా సామిరంగా' చిత్రంలో కీలక పాత్రలో కనిపించిన రుక్సార్, కిరణ్ అబ్బవరం సరసన 'దిల్‌రుబా' సినిమాలోనూ ప్రేక్షకులను అలరించారు. వాణిజ్య చిత్రాలతో పాటు కథకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ప్రస్తుతం తెలుగు, పాన్–ఇండియా స్థాయిలో రూపొందు తున్న పలు చిత్రాలతో బిజీగా ఉన్న రుక్సార్ ధిల్లాన్, దక్షిణాది చిత్ర సీమలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.



## జూలై 2 నుంచి 'పెద్ది'
# ఓటీటీలో సందడి

హైదరాబాద్, జూన్ 29

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కించిన స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' థియేటర్లలో ఘన విజయం సాధించిన తర్వాత ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం భారీ వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద సత్తా చాటింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోగా, జూలై 2 నుంచి స్ట్రీమింగ్‌కు రానున్నట్లు తెలుస్తోంది. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఒకేసారి అందుబాటులోకి రానుంది. అయితే హిందీ వెర్షన్ కోసం ప్రేక్షకులు మరికొంతకాలం వేచి చూడాల్సి ఉంటుంది. థియేటర్లలో విడుదలైన ఎనిమిది వారాల తర్వాతే హిందీ భాషలో ఓటీటీ స్ట్రీమింగ్‌కు అనుమతి ఉండటంతో, జూలై చివరి వారంలో హిందీ వెర్షన్ అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్రామీణ యువకుడి పాత్రలో రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. భావోద్వేగ సన్నివేశాలు, క్రీడా నేపథ్యంలో రూపొందిన ఎపిసోడ్‌లు చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సాన కథను భావోద్వేగాలతో మేళవించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా, శివరాజ్ కుమార్, జగపతిబాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించారు. థియేటర్లలో ఘన విజయం సాధించిన 'పెద్ది' ఓటీటీలోనూ అదే స్థాయిలో ఆదరణ పొందుతుందా అనే ఆసక్తి నెలకొంది.






## 'ఇడుపు కాయితం'
# టైటిల్‌పై చర్చ

హైదరాబాద్, జూన్ 29

సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాసు సమర్పణలో రూపొందుతున్న 'ఇడుపు కాయితం' చిత్రం ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచి సామాజిక మాధ్యమాల్లో టైటిల్‌పై విస్తృత చర్చ జరుగుతోంది. కొందరు ఈ పేరును విమర్శిస్తుండగా, మరికొందరు తెలంగాణ మాండలికానికి ప్రతీకగా పేర్కొంటూ మద్దతు తెలుపుతున్నారు. టైటిల్ ప్రకటించిన వెంటనే కొందరు నెటిజన్లు ఈ పదంపై వ్యంగ్య వ్యాఖ్యలు చేయగా, అది క్రమంగా ఆంధ్ర, తెలంగాణ మాండలికాలపై చర్చకు దారితీసింది. దీనిపై తెలంగాణకు చెందిన భాషాభిమానులు, రచయితలు స్పందిస్తూ ప్రతి ప్రాంతీయ మాండలికం తెలుగు భాషకు చెందిన విలువైన సంపదేనని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు గతంలో తెలంగాణ భాషపై చేసిన వ్యాఖ్యలు మరోసారి వైరల్ అవుతున్నాయి. తెలంగాణ మాండలికం గ్రాంథిక తెలుగుకు అత్యంత దగ్గరగా ఉంటుందని, అక్కడ ఇప్పటికీ అనేక ప్రాచీన తెలుగు పదాలు వాడుకలో ఉన్నాయని ఆయన అప్పట్లో వ్యాఖ్యానించారు. భాషా పరిశోధకుల వివరాల ప్రకారం, 'ఇడుపు కాయితం' అనే పదం తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో చాలా కాలంగా వినియోగంలో ఉంది. గతంలో భార్యాభర్తలు పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నప్పుడు గ్రామ పెద్దల సమక్షంలో రాసుకునే ఒప్పంద పత్రాన్ని 'ఇడుపు కాయితం'గా పిలిచేవారని చెబుతున్నారు. ఇది కేవలం ఒక పదమే కాకుండా తెలంగాణ గ్రామీణ సామాజిక వ్యవస్థకు సంబంధించిన చారిత్రక గుర్తింపుగా భావిస్తున్నారు. ఈ వివాదం నేపథ్యంలో భాషా ప్రేమికులు, సినీ వర్గాలకు చెందిన పలువురు ఒకే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. తెలుగు భాషలోని ప్రతి మాండలికానికీ ప్రత్యేకత ఉందని, ప్రాంతీయ పదాలను విమర్శించడం కంటే వాటి చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలని సూచిస్తున్నారు.

## పెళ్లికి పారిపోదామనుకున్నా..
# కీర్తి సురేష్ ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, జూన్ 29

ప్రముఖ నటి కీర్తి సురేష్ తన ప్రేమ, వివాహం గురించి గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ప్రేమించిన వ్యక్తితో పెళ్లికి ఇంట్లో పెద్దలు ఒప్పుకోకపోతే ఇంటి నుంచి వెళ్లి వివాహం చేసుకోవాలని కూడా ఒక దశలో అనుకున్నానని ఆమె వెల్లడించారు. తెలుగు, తమిళ చిత్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కీర్తి సురేష్, హీరో రామ్ పోతినేని నటించిన 'నేను శైలజ' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అనంతరం 'మహానటి' చిత్రంతో విశేష గుర్తింపు పొందిన ఆమె, పలువురు అగ్ర హీరోల సరసన నటించారు. దీర్ఘకాలంగా ప్రేమలో ఉన్న ఆంటోనీ తట్టిల్‌ను కీర్తి సురేష్ 2024లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకున్నారు. దాదాపు 15 సంవత్సరాల ప్రేమ తర్వాత వీరిద్దరూ ఒక్కటయ్యారు. ఒక ఇంటర్వ్యూలో కీర్తి మాట్లాడుతూ, తమ ప్రేమ విషయం ఇంట్లో చెబితే పెళ్లికి అంగీకరించరేమోనని మొదట భయపడ్డామని చెప్పారు. అవసరమైతే ఇంటి నుంచి వెళ్లి పెళ్లి చేసుకోవాలని కూడా అనుకున్నామని, అయితే కుటుంబ సభ్యులు తమ ప్రేమను అంగీకరించి ఘనంగా వివాహం జరిపించారని తెలిపారు. తమ పెళ్లి ఇరు కుటుంబాల సమక్షంలో ఎంతో వైభవంగా జరుగుతుందని ఊహించలేదని, అందుకే వివాహ సమయంలో తాము ఇద్దరం భావోద్వేగానికి గురయ్యామని కీర్తి సురేష్ పేర్కొన్నారు. వివాహం అనంతరం కూడా కీర్తి సురేష్ సినీ రంగంలో చురుకుగా కొనసాగుతూ వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467